క్లుప్తంగా

ప్రతిభ అవార్డుకు ఎంపికైన జోషిత


జోషిత

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని వేశపోగు జోషితకు 2025వ సంవత్సరం ఫలితాల్లో 559 మార్కులు సాధించడంతో ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ పి.శ్రీనివాసులు శనివారం తెలిపారు. ప్రతిభ అవార్డుతో పాటు రూ.20 వేల నగదును ప్రభుత్వం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ అవార్డుకు ఎంపిన విద్యార్థిని జోషితను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ట పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొర్రాలికొండ తిరుమల నాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూల మాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం


చెత్తను ఎతేయిస్తున్న సర్పంచ్ అరుణాబాయి

యర్రగొండపాలెం: పారిశుధ్య కార్మికుల సమస్యలను సర్పంచ్ ఆర్.అరుణాబాయి శనివారం పరిష్కరించారు. జీతాలు చెల్లించాలని సమ్మెలో దిగిన పారిశుధ్య కార్మికులతో ఆమె చర్చించి పట్టణంలో పేరుకొని పోయిన చెత్తను ఎత్తివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం లోపించడంతో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, తమ సమస్యలు ఏమైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకుందామని ఆమె ప్రతిపాదించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పూర్తి స్థాయిలో కార్మికుల జీతాలు చెల్లిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

త్రోబాల్ పోటీలకు చందలూరు విద్యార్థులు


బెట్లీ


ఆనంద్ జయకుమార్

దర్శి (కురిచేడు): జాతీయస్థాయిలో త్రోబాల్ ఆడేందుకు దర్శి మండలం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బ్రెట్లీ, ఇత్తడి ఆనంద్ జయ కుమార్‌లు ఎంపికయ్యారు. వీరు గతంలో మూడుసార్లు జాతీయ స్థాయిలో ఆడారు. ఈ నెల 18 నుంచి 23 వరకు అసోసియేషన్ నేషనల్ మీట్ త్రోబాల్ మహారాష్ట్రలోని ముంబైలో జరగనుంది. పోటీల్లో ఆడేందుకు వీరిద్దరూ ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంథం గురుప్రసాద్, పీడీ సోము అంజిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు అభినందించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్


కురిచేడు: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వై.పాలెం: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


వై.పాలెం: సందేశం ఇస్తున్న మౌలానా హిదాయతుల్లా

పెద్దదోర్నాల: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. షబ్బీర్ మౌలానా, ఇబ్రహీం మౌలానాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. బక్రీద్ పర్వదిన విశిష్టతను ప్రబోధించారు. ఖుర్బానీ ప్రాధాన్యతను తెలిపారు. ప్రార్థనల అనంతరం ఖబరస్తాన్ వద్దకు చేరుకుని తమ కుటుంబ పెద్దల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పుల్లలచెరువు: త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండగను జరుపుకుంటారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లోని ముస్లింలు బక్రీద్ పండగ నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజు చేశారు. ఈద్గాల వద్ద ముజావర్ అల్లా గురించి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అల్లా పట్ల విశ్వాసం కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరి పట్ల దయ, ప్రేమ, జాలి చూపాలన్నారు.

త్రిపురాంతకం: మానవత్వం, త్యాగం, గొప్పతనం, సాయం చేసే మనసును నేర్పించేదే బక్రీద్ పండగ అని మౌలానా మహ్మద్ ఇస్మాయిల్ అన్నారు. బక్రీద్ పండగ సందర్భంగా మండల కేంద్రం త్రిపురాంతకం, మేడిపి, ఎండూరివారిపాలెం, గణపవరం, వెల్లంపల్లి, విశ్వనాథపురం, గొల్లపల్లి, దూపాడు గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇది మత విశ్వాసం, త్యాగం, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ అంటూ బోధించారు. ఒకరొకొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

యర్రగొండపాలెం: ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వారితో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు స్థానిక ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానా హిదాయతుల్లా పండగ ప్రాముఖ్యత, ప్రస్తుతం సమాజంలో నెలకొన్న పరిస్థితులపై ఆయన సందేశం ఇచ్చారు. అనంతరం దువా చేయించారు. పండగ సందర్భంగా ఎటువంటి అవాఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చౌడయ్య ఈద్గా వద్ద పర్యవేక్షించారు.


తాళ్లూరు: తూర్పుగంగవరం ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు


పెద్దదోర్నాల: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దొనకొండ: ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్నీ గ్రామాల్లో ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బీదలకు దాన ధర్మాలు చేశారు. ముస్లింలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణ, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్‌లు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

తాళ్లూరు: మండలంలోని తాళ్లూరు, తూర్పు గంగవరం, రజానగరం, నాగంబొట్లపాలెం, గంగపాలెం, రమణాలవారిపాలెం గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్ద ముస్లింలు నమాజ్‌లో పాల్గొని బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపున్నారు. ఒకరికొకరు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దారవీడు: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పండగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్దారవీడు, దేవరాజుగట్టు, సుంకేసుల, తంగిరాలపల్లి, గొబ్బూరు గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువుల బోధనలు, పవిత్ర ఖురాన్ ప్రవచనాలు ప్రబోధించారు. నమాజ్ అనంతరం ముస్లింలు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కురిచేడు: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి, భక్తికి, దాన ధర్మానికి ఇది ప్రతీక. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని 12వ నెల జిల్ హిజ్జా 10వ రోజున రంజాన్ పండుగ ముగిసిన 70 రోజుల తర్వాత వస్తుంది. పండగలో అత్యంత ముఖ్యమైన సంప్రదాయం ఖుర్బానీ, అల్లాహ్‌కు కృతజ్ఞతగా ఇబ్రహీం త్యాగానికి గుర్తుగా మేక, గొర్రె, ఒంటె వంటి జంతువులను బలి ఇస్తారు. ఈ మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక భాగం పేదలకు, ఒక భాగం బంధువులకు, స్నేహితులకు, మూడో భాగం సొంత కుటుంబం కోసం వినియోగించుకుంటారు. స్నేహితులు, బంధువులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు.


త్రిపురాంతకం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పుల్లలచెరువు: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


దొనకొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన


ఎమ్మార్సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

దర్శి (కురిచేడు): ఉపధ్యాయుల బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని రద్దు చేసి మాన్యువల్ కౌన్సిలింగ్ అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో దర్శి ఎమ్మార్సీ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఐక్య ఉపాధ్యాయ సంఘాల పక్షాన యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను, దర్శి మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాశీం మాట్లాడుతూ 10 రోజుల క్రితం ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని మాట ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం వివిధ జిల్లాల్లో వెబ్ కౌన్సిలింగ్ అని అనేబుల్ చేయటం, బలవంతంగా నమోదు చేసుకోవాలని వెబెక్స్ మీటింగ్‌లో ఆదేశాలు ఇవ్వడం ఉపాధ్యాయ వర్గానికి తీవ్ర నిరాశను కలిగించిందని పేర్కొన్నారు. వారం రోజులుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి మోడల్ పాఠశాలకు ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను అందజేసి ఉపాధ్యాయులకు ఆనందాన్ని కలిగించిన ప్రభుత్వం ఎస్జీటీల విషయంలో నిరుత్సాహాన్ని కలిగించటం తగదని, విద్యాశాఖ మంత్రి కల్పించుకుని మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి ఉపాధ్యాయవర్గానికి అండగా ఉండాలని కోరారు. కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జి.విజయకుమార్, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బుర్రి శ్రీనివాసులు, నాయకులు వై.రాజశేఖరరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, సహాధ్యక్షులు అట్లూరి రామారావు, గౌరవ అధ్యక్షుడు ఎం.యలమందారెడ్డి, బి.వి నారాయణ, కె. రోశయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల ఎంపిక

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కమిటీలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నియమించారు. ముండ్లమూరు మండల అధ్యక్షుడిగా చింతా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా నల్లమోతు రామకృష్ణ, గోపనబోయిన చిన్న శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా అబ్బని అంజిరెడ్డి, మీనిగ ఏడుకొండలు, జ్యోతి సురేంద్ర, రావులపల్లి శివకృష్ణ, కార్యదర్శులుగా మేదరమెట్ల వీరయ్య, పుచ్చా రవి, పాలెపోగు వీరయ్య, గోపనబోయిన వీరరాఘవులు, కంచర్ల వీరాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కిలారు వెంకట్రావు, ముతికేపల్లి గురవారెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, మోకతోటి నాగాంజనేయులు, కోనేరు రామకోటేశ్వరరావు, కామినేని ఏడుకొండలు, బోగెం ఏడుకొండలు, నల్లబోతు రామకృష్ణ, అచ్చుకట్ల నాగార్జున, తాతిరెడ్డి, అన్నపురెడ్డి ఆదినారాయణరెడ్డి, దాసరి మురళీకృష్ణ, గజ్జల రాముసలారెడ్డి, వాకా అంజిరెడ్డి, అంచుల రాఘవరావు, యానం హరీష్, సంగు బాలనాగిరెడ్డి, బుసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, మంగమూరి సుబ్బారావు, తప్పెట నాగరాజులను ఎంపిక చేశారు.

తాళ్లూరు మండలం..

తాళ్లూరు మండల అధ్యక్షుడిగా తూము వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా పులి ప్రసాద్‌రెడ్డి, ఆలోకం హరిబాబు, ప్రధాన కార్యదర్శులుగా షేక్ చిన కాలేషావలి, కుమ్మిత జయరామిరెడ్డి, వీరమాసు రాములు, అనపర్తి జక్రయ్య, కార్యదర్శులుగా యాచవరపు ఏసు, బీమని సుబ్బారావు, మారం కోటిరెడ్డి, కోట కృష్ణారెడ్డి, నుసుం సుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మూలంరెడ్డి ఓబులరెడ్డి, వంకాయల బాలనాగిరెడ్డి, మంచాల వలసారెడ్డి, యాడిక యలమందారెడ్డి, నన్నూరి వీర నారాయణరెడ్డి, బాపిరెడ్డి నాగిరెడ్డి, లక్కు పోలిరెడ్డి, కైపు కోటిరెడ్డి, విపరాల బాబూరావు, సంగం ధర్మేంద్ర, పెళ్లూరి జాలిరెడ్డి, సూరా చిన్న వెంకటరెడ్డి, గుమ్మడి శ్రీనివాసరావు, సారెడ్డి సుబ్బారెడ్డి, నాలి నాగేశ్వరరావు, పరుపాక కోటేశ్వరరావు, కీర్తిపాటి రామారావు, అవిసిన వెంకటరామిరెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లోకిరెడ్డి సుబ్బారెడ్డి, గువ్వల నారాయణరెడ్డిలను ఎంపిక చేశారు.

బక్రీద్ విందుకు బూచేపల్లి


విందుకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: మండలంలోని మల్లంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దూదేకుల నాసర్ ఆహ్వానం మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బక్రీద్ విందుకు హాజరయ్యారు. పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బూచేపల్లిని దూదేకుల నాసర్ శాలువాతో ఘనంగా సన్మానించారు.మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి అజయ్ రమణ, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముడమంచు చిన్న ముసలయ్య, గుమ్మా ఆదినారాయణ, దూదేకుల ఇస్మాయిల్, యరగొర్ల బాలకృష్ణ, వైస్ సర్పంచ్ చింతగుంట్ల నాగార్జున, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముడమంచు చిన్న యల్లయ్య, ఉపాధ్యక్షులు చింతగుంట్ల యోబు, చిన్న వెంకటయ్య, విజయశేఖర్, గుర్రం మల్లికార్జున, కిన్నెర ప్రసాద్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

దర్శి (కురిచేడు): దర్శి కొత్తపాలెం ఆటో డ్రైవర్ వెలుగోటి ఉదయ్‌కుమార్ కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శనివారం ఆర్థిక సహకారం అందించింది. ఉదయ్‌కుమార్ మృతి చెందటంతో ఆ కుటుంబ సభ్యులు జీవనాధారం కోల్పోయారు. దీంతో వారికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.5 వేలు, దాతల సహకారంతో మరో రూ.6058 వెరసి రూ.11058 ఉదయ్‌కుమార్ భార్య సుజాతకు అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, చింతా తిరుపతి రెడ్డి, చీదెళ్ల బసవయ్య, జె.సుశీలమ్మ, జూపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

దొనకొండ: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఏటా అందించే ప్రతిష్టాత్మకమైన ప్రతిభ అవార్డులకు మండలంలో రెండు పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. తెల్లబాడు జెడ్పీ పాఠశాలకు చెందిన ఆర్.సామ్య బ్లెస్సీ, విశ్వభారతి పాఠశాలకు చెందిన ఎస్వీ సుబ్బారెడ్డి, పి.నందిని, కేవీ సుధీర్, షేక్ మహ్మద్ షా అల్‌హక్, బి.మహేశ్వరనాయక్ ఎంపికయ్యారు. వీరికి ప్రభుత్వం రూ.20 వేల నగదు, సర్టిఫికెట్లు అందజేస్తుందని వారు తెలిపారు.

నేడు కంటి వైద్యశిబిరం

దర్శి (కురిచేడు): రోటరీ క్లబ్ ఆఫ్ దర్శి, ఎస్టీఆర్ మార్కెటింగ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం ఆదివారం స్థానిక పీజీఎస్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. గుంటూరు పెదకాకాని శంకర కంటి హాస్పటల్, జిల్లా అంధత్వ నివారణ సంస్థల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో కంటికి సంబంధించి అన్ని వ్యాధులు చూస్తారని, శుక్లాలు తీసి అవసరమైతే ఆపరేషన్ ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని దర్శి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వర్షంతో రైతుల హర్షం


దొనకొండలో పడుతున్న వర్షం

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రుద్రసముద్రం, పోలేపల్లి, చందవరం, భూమనపల్లి, రాగమక్కపల్లి, ఇండ్లచెరువు, దొనకొండ, వెంకటాపురం గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నాలుగు రోజుల నుంచి విపరీతమైన ఉష్ణోగ్రత ఉండటంతో ప్రజలు కొద్ది మేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారిపోయింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే అవకాశాలు కనబడుతున్నాయి.

అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన వెంకటేశ్

ముండ్లమూరు (కురిచేడు): వేగంగా వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం ముండ్లమూరులో శనివారం జరిగింది. వివరాలు.. ముండ్లమూరుకు చెందిన తాతపూడి వెంకటేశ్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. తాళ్లూరు రోడ్డు వద్దకు వెళ్లే సరికి దర్శి నుంచి అద్దంకి వేగంగా వెళ్తున్న ప్రైవేట్ అంబులెన్స్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.